సాక్షి
నల్లగొండ
మంగళవారం। 4। ఫిబ్రవరి। 2025



కాంగ్రెస్‌లో కయ్యం!
తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు బట్టబయలయ్యాయి. - 8లో



నేడు రథ సప్తమి వేడుకలు
యాదగిరిగుట్ట లో మంగళవారం రథ సప్తమి వేడుకల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. - 10లో



కళాత్మకంగా ఇక్కత్ వస్త్రాలు
పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు కళాత్మకంగా ఉన్నాయని ఎన్‌డీసీలో శిక్షణ పొందుతున్న అధికారుల బృందం కొనియాడింది. - 10లో

న్యూస్‌రీల్

మినీ సరస్ ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మినీ సరస్ ఫెయిర్ –2025 పోస్టర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు నల్లగొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా గ్రామీణ స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన చేనేత, హస్తకళలు, ఆహార ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, బ్యాంక్, ఇండస్ట్రియల్, ఐసీడీఎస్, మెప్మా విభాగాలకు సంబంధించిన వస్తువుల ప్రదర్శన, అమ్మకానికి 45 స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం



ప్రాక్టికల్స్‌ను పరిశీలిస్తున్న డీఐఈఓ

నల్లగొండ : ఇంటర్మీడియట్ (జనరల్, ఒకేషన్) ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సెకండియర్ బోటని, జువాలజీ, ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు మొత్తం 2632 మంది విద్యార్థులు (జనరల్ 1257, ఒకేషనల్ 1375)హాజరు కావాల్సి ఉండగా.. 2375 మంది (జనరల్ 1214, ఒకేషనల్ 1161) హాజరయ్యారు. 257 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగిన ప్రాక్టికల్ పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్ర కోఆర్డినేటర్‌గా వసంతకుమారి



నల్లగొండ టౌన్ : మహిళల్లో వస్తున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్మూలన కోసం జాతీయ ఐఎంఏ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జాతీయ గైనకాలజిస్ట్ అసోసియేషన్లు నడుం బిగించాయి. దేశ వ్యాప్తంగా ఉన్న 50 వేల మంది గైనకాలజిస్టులు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేయాలని నిర్ణయించాయి. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి గైనకాలజిస్టులకు శిక్షణ ఇవ్వడం కోసం నల్లగొండ పట్టణానికి చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ వసంత కుమారిని కోఆర్డినేటర్‌గా జాతీయ ఐఎంఏ నియమించింది. ఈ నెల 4న నకిరేకల్‌లో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 20 మంది బాలికలకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేయనున్నారు. ఈ నెల 7న నల్లగొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 20 మంది బాలికలకు వ్యాక్సినేషన్ చేయనున్నట్లు వసంతకుమారి తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

చింతపల్లి : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం చింతపల్లి మండలం వీటీనగర్ పీహెచ్‌సీ పరిధిలోని, కురంపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటిస్తూ, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కేసా రవి, వైద్యాధికారి వంశీకృష్ణ, సూపర్‌వైజర్లు వెంకటాచారి, పద్మ, ఏఎన్ఎం గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

14న వాహనాల వేలం

నల్లగొండ టౌన్ : వైద్య ఆరోగ్య శాఖకు చెందిన 104 ఎనిమిది స్క్రాప్ (పాతబడిన) వాహనాలకు ఈ నెల 14న ఆన్‌లైన్‌లో ఈ–వేలం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 12వ తేదీలోగా ఈఎండీలు చెల్లించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం www.auction.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

● నేటి నుంచి చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు



మంగళవారం నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయం

ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్

- తొలిరోజు ఒక్క నామినేషన్ దాఖలు
- మీడియా సెంటర్ ప్రారంభం

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు ప్రజావాణి పార్టీ అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు నామినేషన్ దాఖలు చేశారు.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి : కలెక్టర్
ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు వివిధ మాధ్యమాల ద్వారా జారీ చేసే ప్రకటనలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) మీడియా సెంటర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఎంసీఎంసీ సభ్యులు కోటేశ్వరరావు, శేషాచార్యులు, కలెక్టరేట్ ఏవో మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.



రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రజావాణి పార్టీ అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు



మీడియా సెంటర్‌లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

యూరియాలో తేడా ఏల?

డీలర్లకు దొడ్డు రకం.. సొసైటీలకు సన్న రకం కేటాయింపు

- సన్నరకం యూరియా కొనేందుకు రైతుల విముఖత
- దొడ్డు రకం యూరియాను ధరపెంచి విక్రయిస్తున్న డీలర్లు
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు



గోదాములో నిల్వ ఉన్న యూరియా

మిర్యాలగూడ : యూరియా సరఫరాలో అధికారులు తేడాలు చూపుతున్నారు. సన్న రకం యూరియాను సొసైటీలకు, దొడ్డు రకం యూరియాను ప్రైవేట్ డీలర్లకు కేటాయిస్తున్నారు. అయితే.. సన్నరకం యూరియా నాణ్యత తక్కువగా ఉంటుందనే ప్రచారంతో రైతులు ఎక్కువగా దొడ్డు రకం యూరియాను కొనుగోలు చేస్తారు. కానీ సొసైటీల్లో సన్నరకం యూరియా ఉండడంతో.. దొడ్డు రకం కోసం ప్రైవేట్ డీలర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న డీలర్ల దొడ్డు రకం యూరియాను బస్తాపై రూ.100 వరకు ధర పెంచి విక్రయిస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.

62,684 మెట్రిక్ టన్నుల యూరియా రాక..
యాసంగి సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 32 ర్యాక్‌ల యూరియా మిర్యాలగూడకు, ఐదు ర్యాక్‌లు సనత్‌నగర్‌కు, ఒకటి తిమ్మాపూర్, ఒకటి నాగిరెడ్డిపల్లికి వచ్చాయి. ఇందులో అన్ని కంపెనీల యూరియా ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించి మార్క్‌ఫెడ్‌కు ఇప్పటివరకు 62,684 మెట్రిక్ టన్నుల యూరియా రాగా అందులో 31,342.635 మెట్రిక్ టన్నులు సొసైటీలకు, మిగిలిన 31.342.635 మెట్రిక్ టన్నులు డీలర్లకు కేటాయించారు. నల్లగొండ జిల్లాలో 10,691.28 మెట్రిక్ టన్నులు సొసైటీలకు, 10691.28 మెట్రిక్ టన్నులు డీలర్లకు కేటాయించారు. సూర్యాపేట జిల్లాకు 12,456.855 మెట్రిక్ టన్నులు సొసైటీలకు, 12,456.855 మెట్రిక్ టన్నులు డీలర్లకు కేటాయించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు 5,467.23 మెట్రిక్ టన్నులు సొసైటీలకు, 5,467.23 మెట్రిక్ టన్నుల యూరియాను డీలర్లకు కేటాయించారు.

ఏ యూరియా వాడినా ఫలితం ఒక్కటే



యూరియా కేటాయింపు విషయంలో ఎలాంటి తేడాలను చూపించడం లేదు. దొడ్డురకం, సన్నరకం యూరియాలో ఒకేరకంగా (46 శాతం) నైట్రోజన్ ఉంటుంది. ఏ రకం యూరియా వాడినా ఫలితం ఒకే రకంగా ఉంటుంది. డీలర్లు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. రేటు పెంచి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.
– శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

రేటు పెంచి విక్రయం
కోరమండల్, ఐపీఎల్, విడ్కో, క్రిభ్కో కంపెనీలు సరఫరా చేసే దొడ్డురకం యూరియాను డీలర్లకు అందిస్తున్నారు. ఆ యూరియా బస్తా ఎమ్మార్పీ రూ.266 ఉండగా కిందిస్థాయిలో గ్రామీణ సబ్ డీలర్లకు రూ.330 వరకు విక్రయిస్తున్నారు. వారు అదనంగా రూ.20 నుంచి రూ.30 కలిసి బస్తాపై రూ.100 తగ్గకుండా ధర పెంచి.. రూ.366కు రైతులకు విక్రయిస్తున్నారు. అయితే డీలర్లు యూరియా కొనుగోలు చేసే రైతులకు ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదు. కనీసం బిల్ బుక్కుల్లో నమోదు చేయడం లేదు. దీంతో వారు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆధారాలు లేవు. దీన్ని ఆసరాగా చేసుకున్న అధికారులు యూరియాను ఎమ్మార్పీకే విక్రయిస్తున్నారని ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. ఇక సొసైటీలు వారికి వస్తున్న సన్నరకం యూరియాను రైతులకు బలవంతంగా అంటగడుతున్నాయి.

వర్షిత్‌రెడ్డికే బీజేపీ పగ్గాలు

జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి అవకాశం
- ఉమ్మడి జిల్లాలో మూడింటా ఒక్కటే ఖరారు
- ఇంకా ఖరారు కాని సూర్యాపేట, యాదాద్రి బీజేపీ అధ్యక్షులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నాగం వర్షిత్‌రెడ్డిని రాష్ట్ర పార్టీ నియమించింది. ఈ మేరకు నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా ఆయన పేరును సోమవారం ప్రకటించింది. ఆయనకు రెండోసారి అవకాశం కల్పించింది. ప్రస్తుతం నియమించే జిల్లా అధ్యక్షులు వచ్చే మూడేళ్లపాటు ఆ పదవిలో ఉండనున్నారు. కాగా, ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధ్యక్షుల నియామకాన్ని పెండింగ్‌లో పెట్టింది. అభిప్రాయ సేకరణ అనంతరం స్క్రీనింగ్ కమిటీ ఒక్కో జిల్లా నుంచి ముగ్గురి పేర్లను రాష్ట్ర పార్టీకి ఇచ్చినా జిల్లాల్లోని రాజకీయ, సామాజిక సమీకరణాల మేరకు నల్లగొండ జిల్లా అధ్యక్షుడిని మాత్రమే ప్రకటించింది.



నల్లగొండలో వ్యతిరేకిస్తున్న పార్టీ వర్గాలు
నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్ష పదవి కోసం చాలా మంది పోటీ పడ్డారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా నియమితులైన నాగం వర్షిత్‌రెడ్డితోపాటు మాదగోని శ్రీనివాస్‌గౌడ్, కడగంచి రమేష్, బండారు ప్రసాద్, లాలూనాయక్, వీరారెడ్డి, శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, తూటుపల్లి రవీందర్ తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే అందులో అభిప్రాయ సేకరణ తర్వాత వర్షిత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రమేష్ పేర్లను స్క్రీనింగ్ కమిటీ రాష్ట్ర అధిష్టానికి పంపించగా, వర్షిత్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. అయితే వర్షిత్‌రెడ్డి పేరును ఖరారు చేయడం పట్ల ఆ పార్టీకి చెందిన బండారు ప్రసాద్, పోతెపాక సాంబయ్య, మాజీ కౌన్సిలర్లు, ఇతర నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

రెండు జిల్లాలు పెండింగ్
సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధ్యక్షుల నియామకం రెండూ పెండింగ్‌లోనే పడ్డాయి. సూర్యాపేట జిల్లా నుంచి అధ్యక్ష పదవి కోసం కడియం రామచంద్రయ్య, సంకినేని వరుణ్‌రావు, బొబ్బ బాగ్యారెడ్డి, చలిగంటి వీరేంద్ర, చల్లా శ్రీలత రెడ్డి తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో రాష్ట్ర కమిటీ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వాలని భావించినట్లు తెలిసింది. మరోవైపు.. వరుణ్‌రావు వయస్సు సరిపోదని పక్కన పెట్టడంపై పార్టీ శ్రేణులు కొంత ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. నల్లగొండ జిల్లా అధ్యక్షుడి నియామకంలో వర్తించని వయస్సు నిబంధన సూర్యాపేట జిల్లా అధ్యక్షుడి నియామకంలో వర్తింపజేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ నియామకం ఆగిపోయింది. మరోవైపు యాదాద్రి జిల్లాలో ఊట్కూరి అశోక్ గౌడ్, ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పడమటి జగన్‌మోహన్ రెడ్డి పేర్లను స్క్రీనింగ్ కమిటీ రాష్ట్ర నాయకత్వానికి పంపింది. అందులో సామాజిక సమీకరణాల ఆధారంగా అశోక్‌గౌడ్‌కు ఇవ్వాలని అనుకున్నా ఏకాభిప్రాయం రాకపోవడంతో ఆపినట్లు తెలిసింది.

పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
పార్టీ అధిష్టానంపై తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా పని చేస్తానని, అధికార కాంగ్రెస్ పార్టీకి దీటుగా జిల్లాలో పార్టీని విస్తరింపజేస్తానని పేర్కొన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు గెలిచేలా క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణ చర్యలు చేపడతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతానన్నారు. అసంతృప్తులను కలుపుకొని పోతానని వివరించారు.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల నియామకం
నల్లగొండ టూటౌన్ : బీజేపీ జిల్లా అధ్యక్షుడితో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒకరిని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా అంజినాయక్ (దేవరకొండ), జూలకంటి చంద్రశేఖర్‌రెడ్డి (నాగార్జున సాగర్), కనపర్తి సత్యప్రసాద్ (మిర్యాలగూడ), పిండి పాపిరెడ్డి (నల్లగొండ), కంచర్ల గోవర్ధన్ రెడ్డి (మునుగోడు), వనం అంజయ్య(నకిరేకల్)లను నియమించారు.

కేజీబీవీల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగొద్దు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కేజీబీవీ ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశమై కేజీబీవీల్లో ఆహారం, విద్య, నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించి మాట్లాడారు. కేజీబీవీల్లో విద్యార్థినులను అన్ని అంశాలలో తీర్చిదిద్ది వారిని మంచి సామర్థ్యం ఉన్నవారిగా తయారు చేయాలన్నారు. జేఈఈ మెయిన్స్, ఎన్ఐటీ, నీట్ తదితర ఎంట్రన్స్ పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి ఐదుగురిని సైన్స్ ఎక్స్‌పోలకు తీసుకుకెళ్లేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. క్రీడల్లో రాణించేలా తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఈఓ భిక్షపతి, జీసీడీఓ సరిత, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్ల యాత్రను జయప్రదం చేయాలి

సూర్యాపేట: విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ వజీర్ ఆధ్వర్యంలో చేపట్టే యాత్రను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కన్వీనర్ కొండ నకులుడు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20వేల మంది ఆర్టిజన్లను కన్వర్షన్ చేయడం వల్ల ప్రభుత్వంపై భారమేమీ పడదని పేర్కొన్నారు. 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆపరేటర్లపై పని భారం ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ లైన్‌మన్, సబ్ ఇంజనీర్లు, ఆఫీస్ సబార్డినేట్ తదితర పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

బడ్జెట్ కేటాయింపులో కేంద్రం వివక్ష

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని, ఆర్థికమంత్రి దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ : కేంద్ర బడ్జెట్ కేటాయింపులో తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ వివక్ష చూపిందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్ తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో ఆ పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపాయి. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మాత్రమే కేంద్రం ఎక్కువ బడ్జెట్ కేటాయించిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలపై పక్షపాతం చూపిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు, పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కుసుకుంట్ల రాజిరెడ్డి, గడిగ శ్రీను, బొజ్జ శంకర్, సమద్, కత్తుల కోటి, ఖలీల్, ఇంతియాజ్ హుస్సేన్, పోలే జయాకర్, సుభాష్ యాదవ్, ఎండి ఇంతియాజ్, దుబ్బ అశోక్ సుందర్, బీరం కరుణాకర్ రెడ్డి, ఇటికాల శ్రీనివాస్, ఇబ్రహీం, గురిజ వెంకన్న,వజ్జ రమేష్ యాదవ్, జూలకంటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వర్షిత్‌రెడ్డిని మార్చే వరకు పార్టీ ఆఫీస్ మెట్లెక్కం

- బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బండారు ప్రసాద్, నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బండారు ప్రసాద్

నల్లగొండ టూటౌన్ : పార్టీ నియమ, నిబంధనలను తొంగలో తొక్కి నాగం వర్షిత్‌రెడ్డిని బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమించారని, వర్షిత్‌రెడ్డిని మార్చే వరకు బీజేపీ ఆఫీస్ మెట్లెక్కేదిలేదని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్ అన్నారు. సోమవారం నల్లగొండలోని తన నివాసంలో మాజీ కౌన్సిలర్లు, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు, వార్డు అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, మండలాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక కావాలంటే రెండుసార్లు క్రియశీలక సభ్యత్వం ఉండాలని, 45 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు ఉండాలని కేంద్ర నాయకత్వం నిర్ణయించిందన్నారు. కానీ పార్టీ రాష్ట్ర నాయకులు ఆ నిబంధనలు ఉల్లంఘించి వర్షిత్‌రెడ్డిని నియమించారని తెలిపారు. వర్షిత్‌రెడ్డి నియామంపై పునరాలోచన చేయాలని, పార్టీ నాయకత్వం మొండిగా వ్యవహరిస్తే అందరితో చర్చించి తమ దారి తాము చూసుకునే పరిస్థితి కల్పించవద్దని అన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి పోతెపాక సాంబయ్య, పట్టణ మాజీ అధ్యక్షుడు కంకణాల నాగిరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో వర్షిత్‌రెడ్డి రూ.60 లక్షలు దుర్వినియోగం చేశారని.. బూత్ అధ్యక్షులకు ఇవ్వకుండా పక్కదారి పట్టించారని ఆరోపించారు. పార్టీ కార్యాలయ కరెంట్ బిల్లు కట్టకపోతే మూడు సార్లు కట్ చేశారని, ఇప్పటికే రూ.లక్షన్నర బకాయి ఉందని తెలిపారు. సమావేశంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ, మాజీ కౌన్సిలర్లు బొజ్జ నాగరాజు, రావిరాల వెంకటేశ్వర్లు, నాయకులు దాసరి సాయి, గుర్రం వెంకన్న, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పెరిక మునికుమార్ పాల్గొన్నారు.

కేసారం చేరిన దేవరపెట్టె

చివ్వెంల(సూర్యాపేట) : చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర దిష్టిపూజ ముగిసిన తర్వాత సోమవారం సాయంత్రం దేవరపెట్టెను కేసారం గ్రామానికి తరలించారు. ఈపెట్టెను గ్రామానికి చెందిన మెంతబోయిన వంశస్తుల ఇంటిలో ఉంచారు. 15 రోజుల పాటు దేవర పెట్టెకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్, డైరెక్టర్లు పోలేబోయిన నరేష్ యాదవ్, మెంతబోయిన వెంకన్న, మెంతబోయిన చిన్న మల్లయ్య, కుర్ర సైదులు, సిరపంగి సైదమ్మ, వీరబోయిన సైదులు యాదవ్ పాల్గొన్నారు.

చౌడంపల్లి చెరువులోకి కృష్ణా జలాలు

నార్కట్‌పల్లి : మండలంలోని చౌడంపల్లి గ్రామ సమీపాన గల చెరువులోకి సోమవారం బ్రాహ్మణ వెల్లంల – ఉదయ సముద్ర ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలు చేరుతున్నాయి. చౌడంపల్లి గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటడంతో 400 ఎకరాల్లో వరి పంట వేసిన రైతులు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని రైతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. తక్షణమే వారు స్పందించి ఉదయ సముద్రం ప్రాజెక్టు నుంచి చౌడంపల్లి చెరువులోకి సాగునీటిని విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువులోకి నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ సోమవారం కృష్ణమ్మకు పూజలు చేశారు.



కృష్ణా జలాలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

క్లుప్తంగా

సహకార సంఘం ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో సుధాకర్‌రెడ్డి

నడిగూడెం: నడిగూడెం సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగి సంఘం చైర్మన్ వేధింపులు తట్టుకోలేక సోమవారం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నడిగూడెం మండల కేంద్రానికి చెందిన బీరవల్లి సుధాకర్‌రెడ్డి నడిగూడెం సహకార సంఘంలో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సుధాకర్‌రెడ్డి ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. గత ఆరు నెలలుగా సహకార సంఘం చైర్మన్ తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అది తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయంపై చైర్మన్ కొల్లు రామారావును సంప్రదించగా సుధాకర్‌రెడ్డిపై ఎలాంటి ఇబ్బందులకు గురిచేయలేదన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

కోదాడరూరల్: కుటుంబ కలహాలతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని లక్ష్మీపురం కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. లక్ష్మీపురం కాలనీకి చెందిన కొండపల్లి జయంత్ (28) ఆటో డ్రైవింగ్ చేస్తున్నాడు. ఆరేళ్ల క్రితం శిరీష అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొద్దిరోజులుగా జయంత్ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో జయంత్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అతడి భార్య శిరీష గమనించి చుట్టుపక్కల వారిని పిలిచి కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి తల్లి గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

కాలువలో పడి మాజీ ఎంపీటీసీ మృతి



గోవింద్ (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కాలువలో పడి మాజీ ఎంపీటీసీ మృతిచెందాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం మేడారం గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం యల్లాపురం గ్రామానికి చెందిన గుండాల గోవింద్(50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం వ్యవసాయ పనుల నిమిత్తం గోవింద్ బైక్‌పై అదే గ్రామానికి చెందిన బొమ్ము అంజయ్యతో కలిసి అంగడిపేట ఎక్స్ రోడ్ వద్దకు వస్తుండగా.. మార్గమధ్యలో మేడారం సమీపంలోకి రాగానే రోడ్డుపై గుంతలు ఉండటంతో బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో పడిపోయారు. బైక్‌పై వెనుక కూర్చున్న అంజయ్య కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి కాలువ నుంచి వారిని బయటకు తీయగా.. గోవింద్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గోవింద్ గతంలో నంభాపురం ఎంపీటీసీగా పనిచేశారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేటి నుంచి చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు

- రేపు తెల్లవారుజామున స్వామివారి కల్యాణం



గర్భగుడిలోని రామలింగేశ్వరుడు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టుపై పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు రథ సప్తమి సందర్భంగా మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శైవాగమ పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని, నీలకంఠశివాచార్య, దేవాలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మతో పాటు మరో 20 మంది అర్చక బృందంతో ఉత్సవాలను ఘనంగా ప్రారంభించనున్నట్లు ఈఓ సిరికొండ నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కల్యాణం తిలకించేందుకు 6 స్క్రీన్లు ఏర్పాటు

స్వామివారి కల్యాణాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా గట్టుపై, కొండ కింద 6 స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఘాట్ రోడ్డు ఇరువైపులా బారికేడ్లతో పాటు ఘాట్ రోడ్డులో వివిధ ప్రాంతాల్లో మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు. ప్రతిరోజు రాత్రి కొండ పైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చెర్వుగట్టు జాతరకు స్పెషల్ బస్సులు

రామగిరి(నల్లగొండ) : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నల్లగొండ ఆర్టీసీ డిపో నుంచి స్పెషల్ బస్సులు నడపనున్నామని ఆర్ఎం కె.జానిరెడ్డి తెలిపారు. మంగళవారం స్వామి కల్యాణం జరగనున్న నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని డిపో నుంచి 20 స్పెషల్ బస్సులు నడపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చెర్వుగట్టు పైకి వెళ్లే ప్రధాన ద్వారం

విధులు సక్రమంగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నార్కట్‌పల్లి: చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి సూచించారు. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వర్తించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులతో సోమవారం డీఎస్పీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిఘా టీం చురుకుగా పనిచేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. కల్యాణం జరిగిన అనంతరం భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వస్తుంటారని పేర్కొన్నారు. సమావేశంలో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, నల్లగొండ సీఐ రాఘవరావు, నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు..



బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కల్గకుండా నీటి సౌకర్యం, మరుగుదొడ్లతో పాటు ప్రసాదం విక్రయించడానికి గట్టుపైన, కింద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం. భక్తులు పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలి. నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

– సిరికొండ నవీన్‌కుమార్, ఈఓ

క్యాంపస్ సమాచారం

ఎంజీయూ ఆధ్వర్యంలో 'ఐసెట్' నిర్వహణ

నల్లగొండ టూటౌన్ : రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కొరకు నిర్వహించనున్న ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐసెట్)–2025ను ఈ ఏడాది మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ కన్వీనర్ అల్వాల రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐసెట్ నోటిఫికేషన్‌ను మార్చి 6వ తేదీన విడుదల చేసి జూన్ 8, 9 తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు రుసుము జనరల్ అభ్యర్థులు రూ.750, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.550 చెల్లించాలని పేర్కొన్నారు.

స్పిన్‌ట్రానిక్స్ రంగంపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనాథ్

నల్లగొండ టూటౌన్: స్పిన్‌ట్రానిక్స్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనాథ్ అన్నారు. సోమవారం నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో భౌతిక శాస్త్ర విభాగం విద్యార్థులకు స్పిన్‌ట్రానిక్స్‌లో పరిశోధన, ఉపాధి వాణిజ్య అవకాశాలపై ఆయన అవగాహన కల్పించారు. వేగవంతమైన సమాచారాన్ని చేరవేయడంతో పాటు డేటా నిక్షిప్తం చేయడంలో స్పిన్‌ట్రానిక్స్‌కు మంచి భవిష్యత్తు ఉందని వివరించారు. కార్యక్రమంలో కె. సత్తిరెడ్డి, ప్రేమ్‌సాగర్, ఎన్. భిక్షమయ్య, రమేష్, శాంతికుమారి, ఎస్. ఆదిరెడ్డి, బి. వీరస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు



కట్టంగూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు

కట్టంగూర్: కట్టంగూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో కట్టంగూర్‌లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సబ్‌స్టేషన్ పైభాగంలో ఉన్న పీటీ(పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్)లో షార్ట్ సర్క్యూట్‌తో కావడంతో మంటలు వచ్చాయి. పీటీలో ఉన్న ఆయిల్ కారణంగా మంటలు అలుముకున్నాయి. అధికారులు మంటలు ఆర్పివేసి పీటీకి మరమ్మతులు చేపట్టి మూడు గంటల్లో విద్యుత్‌ను సరఫరాను పునరుద్ధరించారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వం

- పోలీసు కేసులు బనాయిస్తే.. ఖబడ్దార్
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ హెచ్చరిక
- తుంగతుర్తి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమావేశం



సభలో మాట్లాడుతున్న నాగరిగారి ప్రీతమ్

మోత్కూరు: దశాబ్ద కాలంగా పార్టీ అధికారంలో లేకపోయినా ఆటుపోట్లను ఎదుర్కొని కాంగ్రెస్‌ను నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరుగనివ్వమని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నాగరిగారి ప్రీతమ్ అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీస్ కేసులు బనాయిస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. సోమవారం మోత్కూరులో కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం మోత్కూరు మండల పార్టీ అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఇది తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వ్యతిరేకంగా జరిగిన అసమ్మతి సమావేశమని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాగరిగారి ప్రీతమ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో నిజమైన కార్యకర్తలు పోటీచేసేందుకు బి–ఫామ్‌లు అందిస్తానని, వారి విజయం కోసం నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు ధరూర్ యోగానందాచార్యులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సామేల్ వెంట ఉంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులేనని అన్నారు. నిజమైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు అర్వపల్లిలో సమావేశం నిర్వహిస్తే పోలీస్ బలగాలతో అరెస్టు చేయించి అక్రమ కేసులు బనాయింపజేశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేసిన నిజమైన శ్రేణులను గుర్తించి స్థానిక సంస్థల్లో పార్టీ టికెట్ ఇవ్వాలన్నారు. ఇటీవల యాదాద్రి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకమైన పైళ్ల సోమిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకునే వారికి అన్యాయం కానివ్వనని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వంగాల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్‌రావు, నాయకులు పత్రైపాటి యుగేంధర్, మాజీ సర్పంచ్ నారబోయిన అంజయ్య, గూడెపు నాగరాజు, గూడెపు పాండు, రాచకొండ రమేష్, అర్వపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు అంతటి నర్సయ్య, తండ సత్తయ్య, బండారు ప్రశాంత్‌రెడ్డి, కొమ్ము రాజేష్, కప్పల రాజేష్, బండారు ప్రశాంత్‌రెడ్డి, మత్రిపల్లి యాదయ్య, కారుపోతుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఒకరు అరెస్ట్

వేములపల్లి: జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను సోమవారం సీఐ వీరబాబు, ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు విలేకరులకు వెల్లించారు. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన పోల కల్పన భర్త చనిపోగా ఇంట్లో పిండి మిల్లు నడుపుకుంటూ తన ఇద్దరు కుమార్తెలను హైదరాబాద్‌లో చదివిస్తోంది. గత నెల 2వ తేదీన ఆరోగ్యం బాగోలేకపోవడంతో కల్పన నాగర్‌కర్నూల్‌లోని తన తల్లిగారింటికి వెళ్లింది. అదే రోజు రాత్రి ఆమె ఇంటి ఎదురుగా ఉంటున్న దాసోజు నరేష్‌కుమార్ కల్పన ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచి ఉంచిన రూ.20వేల నగదు, 1.6గ్రాముల చంద్రహారం, ఆరు గ్రాముల రెండు చేతి ఉంగరాలు, నాలుగు గ్రాముల రెండు జతల చెవి దిద్దులను దొంగలించాడు. దొంగిలించిన బంగారు ఆభరణాలను కుటుంబ సభ్యులకు తెలియకుండా తన ఇంట్లో సజ్జా మీద దాచి పెట్టాడు. నగదు తీసుకొని హైదరాబాద్, తిరుపతి, నల్లగొండ ప్రాంతాలకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. సోమవారం ఎవరికి అనుమానం రాకుండా తన ఇంట్లో దాచిపెట్టిన బంగారు ఆభరణాలను తీసుకొని సూర్యాపేటలో అమ్మేందుకు బయల్దేరాడు. శెట్టిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద అనుమానాస్పదంగా నిలబడి ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నిజం ఒప్పుకుని బంగారు ఆభరణాలను అప్పగించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. నిందితుడి నుంచి బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఐదేళ్లయినా పునరుద్ధరించలేదు

- చిట్యాల, రామన్నపేట, వలిగొండ రైల్వే స్టేషన్లలో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- కరోనా లాక్‌డౌన్ సమయంలో రద్దు
- రవాణా పరంగా ఇబ్బందులు
- రోజు 500 మంది వరకు రాకపోకలు



రామన్నపేట రైల్వే స్టేషన్

రామన్నపేట: సికింద్రాబాద్–నడికుడి మార్గంలో రామన్నపేట రైల్వే స్టేషన్ ఉంది. రామన్నపేట గతంలో అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. నియోజకవర్గాల పునరుద్ధరణలో తిరిగి అసెంబ్లీ కేంద్రంగా ఏర్పాటుయ్యే అవకాశం ఉంది. నాలుగైదు మండలాలకు ప్రధాన కూడలి. పలు మండలాల ప్రజల సౌకర్యార్థం రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేసి దశలవారీగా అభివృద్ధి చేశారు. సికింద్రాబాద్–తిరుపతి మార్గంలో నడిచే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు, సికింద్రాబాద్–విశాఖపట్టణం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–హౌరా మధ్య నడిచే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు కాచిగూడ–మిర్యాలగూడ మధ్య తిరిగే డెమో రైలు, సికింద్రాబాద్–రేపల్లె మధ్య నడిచే రేపల్లె ప్యాసింజర్ రైళ్లు ఉదయం, సాయంత్రం వేళ రామన్నపేటలో ఆగేవి. ఆయా రైళ్లు అనేక వర్గాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేవి. ఐదేళ్ల క్రితం కరోనా మొదటి వేవ్ విజృంభిస్తున్న సమయంలో ప్రభుత్వం రైళ్ల రాకపోకలను నిలిపి వేసింది. కరోనా ఎఫెక్ట్ నుంచి కోలుకున్న తర్వాత దశలవారీగా రైళ్లను పునరుద్ధరించారు. రామన్నపేట రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు రేపల్లె ప్యాసింజర్ రైళ్ల స్టాప్‌లను ఎత్తివేశారు. కేవలం జన్మభూమి ఎక్స్‌ప్రెస్, డెమోను మాత్రమే ఆపేవారు. అనేక విజ్ఞప్తుల అనంతరం రేపల్లె ప్యాసింజర్ రైలును గతేడాది మార్చి నుంచి ఆపుతున్నారు. గత నెలలో వారం రోజులు రేపల్లె రైలు స్టాప్‌ను ఎత్తివేయగా స్థానికుల ఒత్తిడి మేరకు తిరిగి పునరుద్ధరించారు. అలాగే చిట్యాల, వలిగొండ రైల్వే స్టేషన్లలోనూ హాల్టింగ్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మూడు స్టేషన్ల నుంచి రోజూ హైదరాబాద్, మిర్యాలగూడ వైపు 500 మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇందులో రోజు కూలీలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నారు.

తిరుపతి వెళ్లాలంటే నల్లగొండలో ఎక్కాలి

నాలుగేళ్లుగా రామన్నపేట రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపడం లేదు. తిరుపతి వెళ్లే భక్తులు నల్లగొండకు వెళ్లి అక్కడ రైలు ఎక్కాల్సి వస్తుంది. అదేవిధంగా రామన్నపేట రైల్వే స్టేషన్ పరిసర మండలాలైన చౌటుప్పల్, చిట్యాల, పోచంపల్లి, వలిగొండ మండలాల పరిధిలోని ఫార్మా కంపెనీలు, రైస్ మిల్లులు, భవన నిర్మాణం తదితర రంగాల్లో బిహార్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికుల కుటుంబాలు పనిచేస్తున్నాయి. వారు స్వస్థలాలకు వెళ్లి రావడానికి ఐదు రాష్ట్రాల గుండా నడిచే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రైల్వే అధికారులు స్పందించి నారాయణాద్రి, ఫలక్‌నుమా రైళ్లను రామన్నపేటలో ఆపాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి



ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నటువంటి నారాయణాద్రి, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లను మూడేళ్లుగా రామన్నపేటలో ఆపడం లేదు. తిరుపతి వెళ్లే భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. రైళ్లు ఆపాలని ఎంపీ, ఎమ్మెల్యేల ద్వారా రైల్వే అధికారులను కోరాం. ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపి ప్రజల ఇబ్బందులను తీర్చాలి.

– వనం చంద్రశేఖర్, రామన్నపేట

కేంద్ర మంత్రిని కలిశాం



నారాయణాద్రి, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపకపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. వారు సానుకూలంగా స్పందించి రైల్వే అధికారులతో మాట్లాడారు. త్వరలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపే అవకాశం ఉంది.

– బండ మధుకర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు, రామన్నపేట

కుటుంబ తగాదాలతో వృద్ధుడు మృతి

డిండి : కుటుంబ తగాదాల కారణంగా వృద్ధుడి తలకు తీవ్ర గాయం కావడంతో మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి డిండి మండల పరిధిలోని గోనబోయనపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోనబోయనపల్లి గ్రామానికి చెందిన బద్దె రాములు(65)తో అతడి కోడలు ఆదివారం రాత్రి గొడవకు దిగింది. ఈ క్రమంలో కోడలు కర్రతో రాములను కొట్టి రోడ్డుపైకి నెట్టి వేయడంతో అతడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య జంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్ఐ రాజు తెలిపారు.





కందిని ఆశించే తెగుళ్లు.. నివారణ చర్యలు





పెద్దవూర: కందిలో సస్యరక్షణ పద్ధతులను సకాలంలో చేపట్టడం ద్వారానే మేలైన దిగుబడులు సాధించవచ్చునని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ తెలిపారు. కందిని ఆశించే తెగుళ్లు, పురుగులు వాటి నివారణ చర్యల గురించి ఆయన మాటల్లోనే..

పూత పురుగు(మారుకా మచ్చల పురుగు) : లేద ఆకులపై, పూత పైన గుడ్లు పెడతాయి. వీటి నుంచి వచ్చే ల్వారాలు ఆకు, పూలు, పిందెలున్న మొక్క చివరన గూడు చేసుకుని లోపల చేరి ఆకులు, పూలు, మొగ్గలను తింటూ పెరుగుతాయి. ఈ లార్వాలు 13–18 రోజుల వ్యవధిలో గూడులోనే ప్యూపాలుగా మారి తిరిగి 5–7 రోజుల వ్యవధిలో తల్లి పరుగులుగా రూపాంతరం చెందుతాయి.

నివారణ : పురుగు ప్రారంభ దశలో ఎకరాకు 1 లీటరు వేప నూనెను పిచికారీ చేయడం వలన నివారించవచ్చు. ఒక లీటర్ నీటిలో మోనోక్రోటోఫాస్, డైక్లోరిఫాస్ 1.6 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా లీటరు నీటిలో క్లోరిఫైరిఫాస్, డైక్లోర్‌వాస్ 0.1 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలి. ఒక మిల్లీలీటరు డైక్లోర్‌వాస్(నువాన్)ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవడం వలన పూతపురుగు బెడదను నివారించవచ్చు.

శనగపచ్చ పురుగు : ఈ పురుగు లేత ఆకుల మీద, పూమొగ్గల మీద, కాయల మీద విడిగా ఒక్కొక్క గుడ్డు పెడుతుంది. గుడ్డు నుంచి వెలువడిన పిల్ల పురుగులు పత్రహరితాన్ని పూమొగ్గలను గీకి తింటుంటాయి. తదుపరి మొగ్గలు, కాయలు, పూలను తొలచి నష్టపరుస్తాయి. ఇవి కాయ లోపలికి తలను ఉంచి గింజలను తినేస్తాయి. ఈ పురుగులు ఆశించిన కంది కాయలోని ప్రతి కణుపుకు గుండ్రని రంధ్రాలు కనిపిస్తుంటాయి.

నివారణ : వేసవి దుక్కులు లోతుగా దున్నాలి. జొన్న, సోయా చిక్కుడు, నువ్వులు, మినుములు, ఉలవలు, మెట్టవరి పైర్లను పంట మార్పిడిగా వేస్తుండాలి. పొలం చుట్టూ రక్షణ పంటగా జొన్నను సాగు చేసుకోవాలి. పచ్చ పురుగును తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. పైరు విత్తిన 90–100 రోజుల వ్యవధిలో చిగుళ్లను ఒక అడుగు మేర కత్తిరించాలి. 100 రోజుల తరువాత అక్కడక్కడా సుమారు 50 బంతి మొక్కలను నాటుకోవాలి. లింగాకర్షక బుట్టలను హెక్టారుకు 10 చొప్పున ఏర్పాటు చేసుకోవాలి. పురుగులను తినే పక్షులను ఆకర్షించేందుకు వీలుగా హెక్టారుకు 50 చొప్పున టీ ఆకారపు కర్రలను ఏర్పాటు చేసుకోవాలి. దీనిపై పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. పురుగు గుడ్లను, తొలి దశ పురుగులను గమనించిన వెంటనే 5 శాతం వేప గింజల కషాయాన్ని లేక వేప సంబంధిత మందులను వాడుకోవాలి. శుద్ధి చేసిన ఎన్‌పీ వైరస్ ద్రావణాన్ని ప్రతి హెక్టార్‌కు 500 లార్వాల సమానమైన ద్రావణం లేదా బ్యాక్టీరియా సంబంధమైన మందు హెక్టార్‌కు వెయ్యి గ్రాములు ఒక వారం తేడాతో రెండుసార్లు చలికాలంలో సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలి. ల్వారా పురుగులను గుర్తించి ఆ చెట్లను ఊపటం ద్వారా అవి కిందపడిన వెంటనే నాశనం చేయాలి.

- పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే తొలిపూత దశలో ఉన్న సమయంలో క్లోరిపైరిఫాస్ 2.5 లీటర్లు, పూత, కాయదశలో క్వినాల్‌ఫాస్ 2 లీటర్లు లేదా 750–1000 లీటర్ల నీటిలో కిలో ఎసిఫేట్‌ను కలిపి హ్యాండ్ కంప్రెషన్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయాలి.

ఎండు తెగులు : నేలలో తగినంత తేమ ఉన్నప్పటికీ కంది మొక్కలు నీటి ఎద్దడికి గురువుతున్నట్లుగా వడలి పోతుంటాయి. ఆకులు వాడిపోయినట్లుగా ఉంటాయి. పసుపు రంగుకు మారి వేలాడుతుంటాయి. పై కొమ్మ వద్ద ఎండటం ప్రారంభమై కింది కొమ్మ వరకు వ్యాపిస్తుంది. ఎండిన ఆకులు మొక్కకు అతుక్కునే ఉంటాయి. తెగులు తొలి దశలో కాండం మీద బెరడును తొలగించి చూస్తే నలుపు చారలు కనిపిస్తాయి. కాండం నల్లగా మారిపోతుంది. ఈ తెగులును ఆశించే బూజు శిలీంద్రం నేలలో ఎన్నో ఏళ్ల వరకు జీవించి ఉండి 3 మీటర్ల మేర వ్యాపిస్తుంది. ఇది ఉదజని సూచికను 4.6 నుంచి 9.0 వరకు నేలలో ఉష్ణోగ్రతను 35 సెంటిగ్రేడ్ వరకు తట్టుకోగలదు.

కాయ ఈగ – తల్లి పురుగులు నల్లటి ఈగ ఆకారంలో ఉండి కంది పిందెలు, కాయలపై కవచాల్లోకి తమ ప్రత్యేక అవయవాలతో గుడ్లను లోపలికి చొప్పిస్తాయి. వీటి నుంచి వెలువడే తెల్లని కాళ్లలేని పిల్ల పురుగులు కాయలోని గింజల పైభాగంలో దారులు చేసుకుంటూ పెరుగుతాయి. ఈ క్రమంలో ఇవి గింజ లోపలి భాగమంతా డొల్లగా చేస్తాయి. కాయ లోపలి పురుగు మొక్క ఉనికిని కాయ కవచంపై ఏర్పడే పల్చటి పొర ద్వారా గుర్తించవచ్చు. కాయ నుంచి పురుగు వెలువడిన గుర్తుగా చిన్న రంధ్రం కాయ పైభాగంలో ఏర్పడుతుంది.

నివారణ : తల్లి పురుగులను గుర్తించిన వెంటనే వాటి వ్యాప్తిని, పెరుగుదలను అదుపులో ఉంచేందుకు లీటర్ నీటికి 1.6 మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా 2 మిల్లీ లీటర్ల ప్రొఫెనోపాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.

- **నివారణ :** ఎండు తెగులును తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడి ఫార్ములేషన్‌ను 100 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పండి కలిపి నీళ్లు చల్లి, బస్తాలో నీడలో ఉంచాలి. మూడురోజులకు ఒకసారి నీళ్లు చల్లుతూ 10 రోజుల తర్వాత ఆకు పచ్చని శిలీంద్రం కనిపించగానే ఈ ఎరువును ఒక ఎకరం పొలంలో చల్లాలి. కిలో విత్తనానికి 5 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి ఫార్ములేషన్‌తో కలిపి విత్తన శుద్ధి చేసిన అనంతరం విత్తుకుంటే ఎండు తెగులు నుంచి పైరును కాపాడుకునే అవకాశం ఉంటుంది.